**సి.పి.బ్రౌన్ అకాడమి**
**నవ్యవీక్లీ ఉగాది కథలపోటీలో**
**విశేష బహుమతి**
**రూ. 2,000 పొందిన కథ**

చీకటి ముసురుకొని చాలాసేపయింది. తుకారా మనసునిండా చీకటిగానే వుంది. ఎన్నెన్నో ఆలోచనలు. మందిరంలో పెద్దగా సందడిలేదు. తుకారా మనసులోనే కల్లోలంగా వుంది. జరిగిపోయిన ఘటనలూ, జరుగుతున్న పరిణామాలూ చిక్కుముడులుగా ఉన్నై.

సాహితీ సమరాంగణ చక్రవర్తి, సార్వభౌముడట! శ్రీ కృష్ణదేవరాయలు! సంగర విజయాల గురించీ, వారి సాంస్కృతిక ఔన్నత్యం గురించీ, వ్యక్తిత్వ చైతన్యం గురించీ కథలూ, గాథలూ! ప్రతాపరుద్ర గజపతికి అమాత్యులూ, చారులూ, దండనాథులూ చెప్పినవి, తన చెవినా పడినవి.

# తుకారా

## విహారి

అభేద్యమైన కళింగ గజపతుల కోటలవైపు కన్నెత్తి చూసిన వీరుడు. గజపతి పుత్రుల సామర్థ్యాన్నీ, శౌర్యాన్నీ దెబ్బతీసిన ఘనుడు. ఏళ్ల తరబడి సాగుతున్నయుద్ధాలు. రెండు బలగాల్లోనూ ఎన్నెన్ని వీర మరణాలు? ఎంతెంత సంపదనాశనం? క్షతగాత్రులు సరేసరి. ప్రజా రక్షణకు ప్రజాహితం మొదటి ఆవశ్యకతా?

తల్లి – మహారాణి తిప్పాంబకి ఎవరో చెప్తుంటే తానూ విన్నది. రాయల సైన్యం ఉత్సాహ ఉద్రేకాలు నిప్పుకణికలట. 'కొండపల్లి మనదేరా, కొండ వీడు మనదేరా, కాదంటే కటకం దాకా మనదేరా' అని పాడుకుంటూ సాగివస్తున్నారట.

తుకారాకి మనసు వికలమైంది. ఆందోళన నిండింది. ముఖంపై ఖిన్నచ్ఛాయలు పరచుకున్నై.

రాయలూ, తిమ్మరుసూ ఇద్దరూ అఘటనఘటనా సమర్థులట. రాయల రణకౌశలానికీ, తిమ్మరుసు ధీయుక్తికీ తిరుగేలేదని తెలిసి పోతూనే వుంది.

తన తండ్రి ప్రతాపరుద్ర గజపతికి స్వయానా శ్రీనాథ రాజు చెప్తుంటే విన్నవిశేషాలు ఇవన్నీ. రాయల శక్తియుక్తులకు తలవొగ్గిన ప్రత్యక్ష సాక్షి కదా ఆయన. నిన్న మొన్నటి సంభవం కదా ఆయన అనుభవం!

ఈనాటికి,

ఆ వార్తల్లోని నిజం మరోసారి ఋజువు కానున్నదా?

మందిరంలోకి పరివారం హాళాహాళి ప్రవేశించింది. తిప్పాంబ కూడా వచ్చింది.

ప్రస్తుతంలోకొచ్చింది తుకారా. తల్లి కుశల ప్రశ్నలు అయినై. చెలులు వెళ్ళిపోయారు. ఇద్దరే మిగిలారు. మనసులు పంచుకున్నారు. విషయాల పునశ్చరణ జరిగింది. కలతల్నీ కొలుచుకున్నారు.

"మహారాజు శ్రీ అశనిపాతం నుంచీ కోలుకోలేక పోతున్నారు. కోటలు కూలటం కాదు..." తిప్పాంబ చెప్పబోయింది.

అర్థోక్తిలోనే ఆమెని ఆపి తానన్నది తుకారా, "అవునమ్మా. అంతటి అరివీర భయంకరుడు, మా అన్న వీరభద్రుడు. వారినీ, ఎనిమిదిమంది పాత్రుల్నీ బంధించి విజయనగరం పంపాడు కదా రాయలు. దుర్మార్గుడు. వారికేమైందో తెలియరాలేదు" కటువుగా ఉంది తుకారా స్వరం. ఆమె గుండెలో మంట మాటల్లోకొచ్చింది.

తిప్పాంబ కూతురి వైపు తేరిచూసింది. క్షణాల తర్వాత తనకు తాను చెప్పు కుంటున్నట్టు అన్నది "రెడ్డి రాజుల నుంచీ అరవైఏళ్ల క్రితం గజపతుల హస్తగతమైన కొండవీటి దుర్గం. కడకీ నాటికి నా వీరకుమారుని చేతిమీదుగా జారిపోవటం. విధి లిఖితమైన విచేష్టతల్లీ".

"రాయల ఔద్ధత్యానికిది పరాకాష్ఠ" కోపంతో గళం పెంచి అన్నది తుకారా. "ఈ రాయలు వీరస్వర్గానికి కూడా ఇరుకు వాకిళ్లని సమకూరుస్తున్నాడు" అన్నని ప్రాణాలతో బంధించటం గురించిన ధిక్కృతి అది.

సాలోచనగా దీవెల బారువైపు చూస్తూ అన్నది తిప్పాంబ, "కానీ, రాయల్ని గురించీ, వారి కళాసాహిత్య సాంస్కృతిక సామాజిక శోభల్ని గురించీ బాగానే తెలుస్తోంది. సర్వసమర్థమైన రాజ్యపాలనా, ప్రజా సంక్షేమ దృష్టీ కలిగిన సార్వభౌముడనే అంటున్నారు".

"ఎంతఘనుడైనా ఈ రాజ్య విస్తరణ కాంక్షనేమంటారు? కడివెడు పాలల్లో ఒక్క ఉప్పుగల్లు చాలదూ?" నిరసనగానే అన్నది తుకారా. "నిరంకుశత్వంలో ఆ రాయలకు రాయలే సాటి అని కొండపల్లి ముట్టడి పర్యవసానం, రాజమహేంద్రవరం విజయానంతర సంఘటనలూ తెలియజేస్తూనే ఉన్నైకదా! మా అన్న రామచంద్రదేవ్‌కి జరిగిన పరాభవం మాత్రం...?" దుఃఖంతో, కోపంతో తుకారా మాటలు మ్రింగింది.

తుకారా ఆవేశానికీ, ఉక్రోషానికీ, రోషానికీ మారు పలకలేదు తిప్పాంబ. మందిరంలో మౌనం ప్రవహించింది.

తల్లి ఆంతర్యం అర్థం కావటం లేదు తుకారాకి.

ఆమె రాయల గుణ గణాల పట్ల ప్రశంసా పూర్వకంగా భాషిస్తోంది. ఎందువలన?

తిప్పాంబకి కూతురి మనసు తెలుస్తూనే వుంది. రాయల పట్ల కోపం, రాయల చర్యలకు నిరసన, రాయల కవ్వింపుకు తిరస్కారం ప్రస్ఫుటంగా వుంది. రాయల పట్ల వైముఖ్యం? ఉదయగిరితో మొదలైన రాయల పూర్వ దిగ్విజయ యాత్రాల నుంచీ, ఇప్పటి వరకూ జరిగిన, జరుగుతున్న సంభవాలు దృశ్యాలు దృశ్యాలుగా ఆమె కళ్లకు కట్టినై.

గజపతుల రాచకార్యాల్లో రాణివాసమేమీ పూర్తిగా కడగా నిలిచిన పరిస్థితి లేదు. అందుకనే, విషయాలు ఇద్దరికీ తెలుసు.

ఉన్నట్టుండి ప్రతాపరుద్ర గజపతి వారి రాక సూచించబడింది. మహారాణీ, కుమార్తె సావధానులయ్యారు.

గజపతి ప్రవేశించి పీఠం మీద ఆసీనుడైనాడు. గౌరవ పూర్వక అభివాదంతో కూర్చున్నారు తల్లీకూతురూ.

''ఇప్పుడే అందిన వార్తని మీతోనూ పంచుకోవాలని వచ్చాము'' మహారాజు అన్నాడు. తిప్పాంబ, తుకారా ఉత్సుకతతో వారికేసి చూశారు. ''అవును. రాయలు మన వీరభద్రగజపతిని విడిచి పుచ్చారని వార్త వచ్చింది. అంతేకాదు. స్వయంగా రాయలే వీరభద్రుని సంప్రదించి చిట్టల దుర్గ ప్రాంతానికి తన పాలక ప్రతినిధిగా నియమించాడట''.

ఆశ్చర్య సంభ్రమాలకు లోనయ్యారు ఇద్దరూను. సంతృప్తితో వెలిగింది తిప్పాంబ మొహం. తుకారా ఉదాసీనంగా స్వీకరించిందీ వార్తని. క్షణాల తర్వాత అడిగింది. ''మరి, ఈ కటకం దండయాత్ర ఏమిటి ప్రభూ?'' తిప్పాంబ కూడా రాజుకేసి చూసింది.

''రాయల రాజ్యతంత్రంలో భాగం ఇదంతా. పాలనా వికేంద్రీకరణ. దుర్గం తర్వాత దుర్గంగా ఆధిపత్యం సాధించటం''.

''గిల్లి నోరు మూసే తత్వం'' ఠక్కున అన్నది తుకారా.

కూతురు వైపు సాలోచనగా చూశాడు గజపతి.

''గజపతుల పరాక్రమం, యుద్ధ వ్యూహం రాయల్ని నిలువరించాలని వాంఛిస్తున్నాను ప్రభూ'' అంది తుకారా. తల పంకించాడు ప్రభువు. మెచ్చికోలుగా కూతురివైపు చూసి, హస్తవిన్యాసం చేశాడు.

''అదే ప్రభువుల ధైర్యం, సమాధానం తల్లీ'' అన్నది తిప్పాంబ.

అలతి నవ్వుతో లేచాడు గజపతి. నిష్క్రమణకి అడుగు కదల్చాడు. ప్రభువు వెనగ్గా తిప్పాంబా కదిలింది. తుకారా మందిర ద్వారం దగ్గర నిలబడి



పోయింది. వాళ్లు వెళ్లారు.

ఆ రాత్రి కంటికి నిండుగా కునుకులేదు తుకారాకు.

రాయల సౌజన్యానికీ, దండయాత్రలకీ ఎక్కడ పొంతన? ఈ ఆలోచన తోనే తెల్లవారలేదామెకు!

***

రాజధానిలో ఒకటే కలకలం.

రాయలు కటకం వైపు దూసుకు వస్తున్నాడనేది వార్త.

మహారణ్య మధ్యంలో, కొండకోనల్లో యుద్ధప్రవీణులైన, మహాధానిష్కులైన అరవై వేలమంది యోధుల్ని మట్టుబెట్టి, ముందుకు కదిలాడు రాయలు. వారంతా చితాపుఖానుని సేన. అతను బంధింప బడ్డాడు.

పొట్నూరులో విడిడి చేసింది రాయలసైన్యం.


ప్రతాపరుద్ర గజపతి అరికాళ్ల కింద మంటలు రేగినై. మంత్రి సామంత, దండనాధుల్ని సమావేశపరిచాడు. మంతనాలు సాగినై. ఆయన సామంతులు పదహారుమంది పాత్రులూ వచ్చారు.

''మా శౌర్యప్రతాపాలు ప్రభువులకు తెలుసు. అకుంఠితమైన ధైర్యంతో ముందుకుసాగుతాం. ఆ రాయల్ని కట్టడి చేయటం మా కర్తవ్యం ప్రభూ'' అంటూ కత్తి దూశాడు బలభద్రపాత్రుడు. అతన్ని అనుసరిస్తూ తమ తమ వీరవిక్రమ జృంభణాన్ని తేటతెల్లం చేశారు భీమ, ముకుంద, భీకర, దుర్గ, ఖడ్గ, రణరంగాది పాత్రులందరూ.

సలహాలూ సంప్రతింపులూ అయినై. వ్యూహ రచన జరిగింది.

గజపతి ఊపిరి పీల్చుకున్నాడు. ''ఏళ్ల తరబడి సాగుతున్న యుద్ధానికి ఇది చరమదశ'' అనుకున్నాడు.

జయజయ ధ్వానాలతో సభా, సమావేశం ముగిశాయి.



***

తిప్పాంబ మందిరానికి చేరిందీ వార్త. తుకారా కూడా అక్కడే వుంది. సంతృప్తివీచికలు పరుచుకున్నై. రాయల్ని నిలువరించాలనే గజపతి కూటమి నిర్ణయంతో తుకారా మనస్సు స్తిమిత పడింది.

గవాక్షం వరకూ నడిచి బయటికి చూసింది తుకారా.

రాజధాని లోని వివరం లేని సవ్వడులు వినిపిస్తున్నాయి. జనం కోలా హలం. యుద్ధోత్సాహం గాలిలో తేలియాడుతున్నట్టనిపించింది. సుదూరంగా.... రాయలసైన్యం విడిది చేశారన్న పొలం లోని గుడార్ల వాసనలు క్రమ్ముకుంటున్నట్లనిపించింది తుకారాకు. మానసికమైన దృశ్య స్పృహ అది.

''ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్?'' అంది తల్లి. వచ్చి దగ్గరగా నిలబడిందామె.

తల్లి కళ్లల్లోకి చూస్తూ ''రాయలకు కించిత్ బుద్ధి చెప్పేవారు లేరా అని ఆలోచిస్తున్నాను'' అన్నది తుకారా.

అదోలా నవ్వింది తిప్పాంబ. క్షణాల్లో తెప్పరిలి అన్నది, ''ఎంత మాట అన్నావు జగన్మోహినీ. తిమ్మరుసు గురించి విన్నాం కదా. ఎరను కుంటున్నావ్ ఆయన్ని. రాయల విద్యాగురువు. ప్రాణరక్షకుడు. విజయ నగరం ఆత్మకే రక్షకుడాయన. సార్వభౌమత్వం రాయలదే కానీ, దేశాభ్యు దయానికీ, ప్రజా క్షేమానికీ కావలసినదంతా తిమ్మరుసు చెప్పుచేతల్లోనే జరుగుతుంది. పాలన నుండి పన్నులు వ్యవసాయ ప్రణాళికల వరకూ సమస్తం ఆయన రచనలే. రాయల పూర్ణవ్యక్తిత్వం, వికాసం తిమ్మరుసు మేధాజనితాలు. ఆ తలలు రెండూ రెండే! ఎదుటి పక్షానికి బహు ప్రమాద కారకాలు!''

తల్లిమాటలు తుకారాకి రుచించ లేదు. మొహం చిన్నబుచ్చుకుంది. అయితే, తల్లి 'జగన్మోహినీ' అని పిలిచినప్పుడల్లా తుకారా అంతఃకరణంలో ఒక మార్దవం, ఆప్యాయత ప్రసరిస్తాయి. తనకు ఏదైనా హితం చెప్పేటప్పుటడు మాత్రమే ఆమె చల్లగా ఆ పేరుతో సంబోధిస్తుంది. ఆలోచనలో పడింది తుకారా. ఇంతలో తిప్పాంబ తన సంభాషణకు ముక్తాయింపుగా మరోమాటా అన్నది. ''మీ అన్న వీరభద్రుని ఉదంతం తలుచుకున్నా, నా కెందుకనో రాయలు సౌజన్య మూర్తి అనిపిస్తోంది''.

''అమ్మా!'' ఉన్నట్టుండి పిడుగులు రాల్చినట్లు గట్టిగా అరిచింది తుకారా. తిప్పాంబ విస్తుపోయింది.

''మహారాణీ వారు మన్నించాలి. శత్రు ప్రశంసకి కూడా ఒక...'' మాటని ఆపి, తల విదిలించుకుంది తుకారా. తక్కున తన పీఠం మీద కూర్చుని విసుగుదలనీ, కినుకనీ వ్యక్తం చేస్తున్న భంగిమ నిచ్చింది.

మందిరంలో వాతావరణం గాంభీర్యాన్ని పులుముకుంది.

కొద్దిపాటి నిశ్శబ్దం తర్వాత తుకారాయే మళ్లీ అన్నది, ''అసలా రాయలకు గజపతులతో విరోధం ఎందుకు? కక్షఎందుకు? యెడతెగని దండ యాత్రలతో, దుర్మార్గంగా-శాంతికీ సహనానికీ పరీక్ష పెడుతూనే వున్నాడు కదా. అదా సౌజన్యం? అదా ప్రజా క్షేమాకాంక్ష? ప్రజలంటే విజయనగరం వారేనా? మన మాన్యులూ సామాన్యులూ ప్రజలు కారా? అంతెందుకు - తన సైన్యంలో ఎన్నివేలమంది అహరహమూ యుద్ధంలో అల్లాడిపోతున్నారు? ఎందుకీ ఉన్మాదం? ఏమిటీ ఉన్మత్తత? చెప్పండి మహారాణీ?''

కూతురిలోని ఉద్వేగాన్నీ, బాధనీ, ఆవేదననీ అర్థం చేసుకోలేనిదేమీ కాదు తిప్పాంబ. తుకారావైపు కన్నార్పకుండా పరీక్షగా చూస్తూ కూర్చుంది. క్షణాల తర్వాత తల్లి చూపులకి కొంత ఇబ్బందిగా ఆ పీఠంలో మసల సాగింది తుకారా.

నిశ్శబ్దం కురుస్తోంది.

ఇద్దరి ఆలోచనలూ రాయల చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

తుకారాని చూస్తుంటే ఆశ్చర్యం వేసింది తిప్పాంబకి. ''ఎంతలో ఎంత దయిందీ పిల్ల! నిన్నమొన్న రెక్కలు విప్పిన పసి పిల్ల. ఎంతలో ఎంత పరిణతి! ఎంతఆలోచన! ఎంత నిబద్ధత! ఎన్నెన్ని ప్రశ్నలు?'' అనిపించింది. కూతురి ముఖపద్మం ఇప్పటికీ ప్రసన్నమైంది.

చూపు మరల్చింది తిప్పాంబ. ఎదురుగా వున్న చిత్రపటాల్ని చేత పట్టుకుంది. ఒక్కొక్కటీ చూసి పక్కన చిన్న చదురు మీద వుంచసాగింది. కొద్ది సేపటికి ఒక

చిత్రాన్ని తీసి కుమార్తె చేతికిచ్చింది. 'శ్రీ కృష్ణదేవరాయలు!'' అన్నది తిప్పాంబ.

ఆశ్చర్యంతో కళ్లు చికిలించింది తుకారా!

***

తెల్లవారటమే సంచలనంతో తెల్లవారింది. ఎటు చూసినా ఒకటే కలకలం. రాజభవనాలూ, రాణివాసమూ ఎల్లెడలా అదే వార్త. అదే చర్చ.

బలభద్రుడాది పదహారు మంది పాత్రులూ, మహారాజ గజపతిని ఒంటరిని చేసి రాయల పక్షం చేరిపోయారనే దుర్వార్త; దుర్వార్త! 'ఇంత నమ్మక ద్రోహమా?' ఇదే ప్రశ్న!

ఆ వేళ

తుకారాకి గుండె మండి పోతోంది. కళ్లల్లో కసి. తనువంతా ఉద్రేకంతో ఊగిపోతోంది. తిప్పాంబ మందిరంలోనే వున్నదామె.

ఆ పగలంతా

గజపతి సమావేశాల్లో మునిగి పోయాడు. అమాత్యులూ, ఇతరమాన్య శ్రేణీ, సైనికాధికారులు చర్చలు సాగించారు. పరిస్థితులూ, పరిసరాలూ ఏకపక్ష విజయాన్ని సూచిస్తున్నాయా అన్న బెరుకు అందరిలోనూ తలెత్తింది. సైన్యాధిపతులు బింకంతో వున్నారు.

కని చీకటివేళ

వివరాలు తెలిశాయి. తిప్పాంబా, తుకారా చేష్టలు దక్కి కూర్చున్నారు. తిమ్మరుసు తన చాకచక్యంతో పాత్రుల్ని రాత్రికి రాత్రి గజపతికి వైరుల్ని చేసేశాడు! వారంతా రాయలకు గజపతిని బందీగా అప్పగించటానికి సిద్ధమైనట్లు తెలిపే ఋజువులూ లభ్యమైనై. మోసమంతా బట్టబయ లైంది.

కారాలూ మిరియాలూ నూరుతోంది తుకారా.

మహారాజు వచ్చాడు.

రాత్రి పొద్దుపోయేవరకూ మంతనాలు సాగేయి. గజపతి తన మనసులో సుడి తిరుగుతున్న అనేకానేక ఆలోచనల్లో ఒక ఆలోచనని బయట పెట్టాడు. 'బండెడు చీకటినెత్తిన వేసుకుని ప్రసవానికి పోవటమే శరణ్యమా?' అనేది ఆ యోచన!

నివ్వెరపోయింది తుకారా. అరివీర భయంకరుడై దక్షిణ తీరభాగాన్ని సునాయాసంగా తన ఏలుబడికిందికి తెచ్చుకున్న అంతటి గజపతి ఇంత బేలగా ఈ విధంగా తలగాచుకోవటమా?

కోపంతో, రోషంతో కుతకుతలాడిందామె మనసు.

ఉడుకు పాయసంతో నాలిక కాలిపోయినట్లయింది.

''మహారాజా. మీరంగీకరిస్తే రేపో మాపో మ్రోగబోయే రణభేరీ నాదాన్ని నేనే ఆ రాయలగుండెల్లో సమ్మెట మ్రోతగా చేస్తాను. ఆ రాయల సామ్రాజ్య విస్తరణదాహానికి నాలుక పిడచ గట్టిస్తాను'' తుకారా కళ్లు చింత నిప్పుకలు రాలుస్తున్నాయి.

''తల్లీ జగన్మోహినీ'' అన్నాడు గజపతి రుద్ధమైన కంఠంతో

''మహారాజు ఆలోచనలో అది వొకటని మనసు పంచుకున్నారు జగన్మోహినీ. అంతే. అవసరపడకు'' తిప్పాంబ అన్నది.

''మీకు చెప్పేటంత దాన్నికాదు తండ్రీ. అయినా, దుఃఖాన్నీ, దారిద్ర్యాన్నీ కూడా భరించవచ్చేమో కానీ మనకు మనంగా పరిభూతులం కావటమా ప్రభూ?''

## కళింగ జైత్రయాత్రల నేపథ్యంలో



సాహితీ సమరాంగణ చక్రవర్తి కళింగ జైత్రయాత్రల నేపథ్యంలో చారిత్రకాధారంగా కాల్పనిక వాస్తవికతకు కథాత్మని జోడించి 'తుకారా' కథని రాశాను. బహుమతినిచ్చి ప్రోత్సహించిన 'నవ్య'కు హృదయపూర్వక కృతజ్ఞతలు.

-విహారి

**9848025600**

గజపతీ, తిప్పాంబా కుమార్తె దెస చూస్తూ వుండిపోయారు.

రాత్రి గడుస్తోంది! తలపుల చినుకులు రాలుతూనే వున్నై!

***

రోజులు గడుస్తున్నాయి.

రాయల సైన్యసన్నాహాలు, రాయలూ తిమ్మరుసూ కలిసి ఆలోచన చేస్తున్న వ్యూహాలూ.... గజపతికి చేరవేస్తున్నారు చారులు. కటకంలో రాచవారికీ, సైనికాధికారులకూ కంటిమీద కునుకు లేకుండా పోయింది. రాయల సైన్యం పాళెం నుంచీ కదలలేదని మాత్రం దృఢంగా వార్తలు వస్తున్నాయి.

ఆ వేళ,

అనూహ్య పరిణామం జరిగింది. కొలువు వేళ

గజపతి దర్శనం కోసం రాయల దూతవచ్చి ప్రభువు అంగీకారాన్ని అర్థించాడు. గజపతి నివ్వెరపోయాడు. రమ్మన్నాడు. వచ్చిన దూత. తెచ్చిన సందేశపత్రాన్ని అందచేశాడు.

కొలువు సాగుతోంది. అమాత్యులూ సైనికాధికారుల సమక్షం. ప్రక్కన అంతర హర్మ్యం జాలకం వెనుకగా రాణీ, రాజ కుమారీ ఉత్సుకతతో తిలకిస్తున్నారీ దృశ్యాన్ని.

అమాత్యులు చదువుతున్నారా సందేశాన్ని. సంబోధనలు, గౌరవ ప్రకటనల తర్వాత సారాంశం సాగింది. ''జరిగిన సంభవాలకి వెఱగేమీ లేదు. ప్రతాప రుద్రగజపతీ, రాయలవారు కళింగదేశం వారితో శాంతినీ, మైత్రినీ కాంక్షిస్తూనే ఉన్నారు. అయితే, పురుషోత్తమ గజపతి వారి ఉదయగిరి ముట్టడివరకూ జరిగిన గజపతుల దుందుడుకు చర్యల వలన, తీరాంధ్ర దేశంలో శాంతి సిద్ధి ఎల్లవేళలా కంటిలో నలుసుగానే వుంది మాకు. మా సార్వభౌమాధికారాన్ని అంగీకరించినట్లే అంగీకరించి, చేసుకున్న ఒడంబడికల్ని మన్నించకుండా ఆనాటి సాళువ నరసింహుల వారికి వారి మరణం వరకూ మీరంతా చెప్పులోని రాళ్లలా నిలిచారు. మా దండ యాత్రలకి కారణం ఇది అని మీ మనసుకూ తెలుసు. సరి ఇప్పుడు ప్రజాక్షేమం దృష్ట్యా మీరు రాయలతో సంధిని కోరుకోవచ్చు. కాదంటే కాగల కార్యం విజయనగర వీరసైనికులే తీరుస్తారు'' ఇదీ హెచ్చరిక!

కొలువు. కొలువంతా మౌనముద్ర దాల్చింది.

పైన,

తుకారా మనసు కాగుతున్న చెరకు పానకంలా కుతకుతలాడుతోంది. ఆవేశాన్నీ, ఉద్రేకాన్నీ నిగ్రహించుకోలేక పోతోంది. తల్లి తిప్పాంబవైపు సాలోచనగా చూసింది. అప్రయత్నంగానే ప్రశ్నని వదిలాయి పెదవులు, ''ఏమిటిదంతా తల్లీ? ఆ రాతలు వాస్తవమా?''

తిప్పాంబ చూపులు మరల్చుకుంది. ''చెప్పండి మహారాణీ'' అని మళ్లీ రెట్టించింది తుకారా. తల్లి నేల చూపులు చూస్తూ, అవునన్నట్లు తలపంకించింది.

కొరడా దెబ్బ తగిలినట్లయింది తుకారాకు. తక్కునలేచి, విసవిసా తన మందిరానికి వెళ్లిపోయింది.

ఆ రాత్రి మహారాజు మందిరంలో చాలాసేపు చర్చ సాగింది. తిప్పాంబకి ఇది వాంఛనీయమైన పరిణామం. ప్రభువుకు సందిగ్ధ స్థితి. తుకారాం తిరస్కార అభిప్రాయం.

పొద్దుపోయిన తర్వాత ఎప్పటికో

తిప్పాంబా, తుకారా తమ తమ మందిరాల్లోకి వెళ్ళిపోయారు.

తెలతెలవారుతుండగానే ఆవార్త రాజధానిలో గుప్పుమంది!

తుకారా అదృశ్యమైంది! రాజమందిరం, రాణివాసం విచార గ్రస్తమైనాయి.

అత్యయిక పరిస్థితి. అసాధారణ భద్రతాచర్యలూ, అన్వేషణా కార్యక్రమం. కళింగమే సంచలించిపోయింది.

సూర్యుడు నడినెత్తికెక్కిన వేళ.

తుకారా విజయనగర సైన్యానికి బందీగా చిక్కిందనే వర్తమానం రాజ్యాన్నే అకలాకుతలం చేసింది.

అక్కడ పాళెం గుడార్లలో తిమ్మరుసు ముందు తుకారా. దెబ్బతిన్న బెబ్బులి. ఆమె గాండ్రింపుల మధ్య తిమ్మరుసు చిరునవ్వు. ''జగన్మోహినీ వారు వాస్తవాల్ని గమనించాలి. మరణశయ్య మీద కూడా నరసింహ రాయలవారు గజపతులు హరించిన తమ రాజ్యం గురించే పలవించారు''. రుసరుసలాడుతోంది తుకారా. ఆయన తన మాటల్ని కొనసాగించాడు. ''విజయనగరం వారి రాజనీతిలో తొలిపంక్తి సఖ్యమే. మలిపంక్తి కయ్యం. కయ్యంలో ఒక విధానం భేదోపాయం కదా. జరిగిందీ. జరిపిందీ అదే''.

తుకారా మనస్సు అస్తిత్వవేదనతో మూలిగింది. తన అంచనాలూ, అభిప్రాయాలూ వాస్తవాన్ని తెలిసి చేసినవి కావు. ఆమె మేధ విచికిత్సకు లోనయింది.

తుకారా వైపు నిశితంగా చూస్తూ అన్నాడు తిమ్మరుసు. ''మా ప్రతిపాదన ఫలిస్తే ముందున్నది వియ్యమే. అంతా శాంతీ, సంక్షేమం''

ఆశ్చర్యంతో తలెత్తి ఆయన్ని చూసింది తుకారా. వెంటనే తలవంచుకుంది. అన్యమనస్క అయింది. అంతలోనే అన్నాడు తిమ్మరుసు.

''అవును తల్లీ. రాయల మనసులో జగన్మోహినీ దేవి పదిలంగా ఉన్నారు''.

***

ఇప్పుడు

విజయనగరంలో వెలుగువెన్నెల కురుస్తోంది! కళింగమంతా శాంతీ, సౌభాగ్యం! తుకారా మనసులో సన్నని మంచుపూల తుంపర!!

❑